క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో ఆదివారం ఆలయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిసేవా సమితి ట్రస్ట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రేపాల పురుషోత్తం, కార్యదర్శిగా మొరిశెట్టి వెంకటరమణారావు, కార్యదర్శిగా బుస్సా మహేష్, ఉపాధ్యక్షులుగా బొల్లం శ్రీను, దివ్వెల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా గజ్జి అప్పారావు, బోనగిరి ఉపేందర్, కార్యవర్గ సభ్యులుగా దయాకర్, చంద్రమోహన్, నర్సింహారావు, విజయ, కృష్ణమూర్తి, సూర్యప్రకాషరావు, చందాల వెంకటేశ్వర్లు, కిషోర్, శ్రీహరిరాజు, గౌరవ సలహాదారులుగా మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, కిరణ్‌కుమార్, చిల్లంచర్ల సత్యనారాయణను ఎన్నుకున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని అమరవరంలో నీటి మునిగిన పంట పొలాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట అరవింద్, బాలసైదులు, నవీన్, గోపి, రాంబాబు, లక్ష్మమ్మ, భద్రయ్య, రైతులు ఉన్నారు.

నేరేడుచర్ల : అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకన్న తదితరులున్నారు.

సీపీఎస్ ఉద్యోగుల ఆందోళన

కోదాడ : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆదివారం పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, బడుగుల సైదులు, కరుణాకర్, శేఖర్, నాగేశ్వరరావు, జానకీరామ్, వేణుకుమార్, కోటేశ్వరరావు, రాంబాబ్, బాలాజీ, ఖాజా ఉన్నారు.

ఘనంగా మాసకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో స్వామివార్ల విగ్రహాలకు పూలతో, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, శంభిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని శివాజీనగర్ ఎస్సీకాలనీలో పేకాట స్థావరాలపై దాడి చేసి పలువురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ ఆదివారం తెలిపారు. ఎస్సీకాలనీలో మచ్చ నాగేంద్రబాబు ఇంట్లో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో దాడిచేసి 12మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.13,970నగదు, 9మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఘనంగా గంగమ్మతల్లి జాతర

హుజూర్‌నగర్ : పట్టణంలో యాదవులు గంగమ్మతల్లి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అవార్డుల అందజేత



అవార్డులు అందుకుంటున్న మహిళలు

గరిడేపల్లి: మండల పరిధిలోని గడ్డిపల్లిలోని శ్రీ అరబిందో కృషి విజ్ఞాన కేంద్రంలో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ పొందిన కల్మలచెరువుకు చెందిన మహిళలు కళ్యాణి, మమత ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఉన్న నారమ్ సంస్థలో డీడీజీఐసీఐఆర్ ఆర్‌సీ అగర్వాల్, మాజీ వైస్ చాన్స్‌లర్ పద్మరాజు, నారమ్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావులు నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ 2023-24 స్టేట్ ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డులను వారికి అందజేశారు.

వర్ష బీభత్సం.. అపార నష్టం

- కోదాడను ముంచేసిన భారీ వర్షం
- పలు కాలనీల్లోకి చేరిన నీరు
- కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలోని తెగిన చెరువు కట్టలు.. నీటమునిగిన పంట పొలాలు
- మఠంపల్లి ఎస్సీకాలనీలో ఇళ్లలోకి చేరిన వరదనీరు
- వరద నష్టాన్ని పరిశీలించిన కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్
- నేడు రెండు నియోజకవర్గాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన



కోదాడ : అలుగుపోస్తున్న కోదాడ పెద్దచెరువు



చిలుకూరు : చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే మార్గంలో కోతకు గురైన రోడ్డు



మఠంపల్లి : చౌటపల్లిలో ఊరచెరువుకు పడిన భారీ గండి



హుజూర్‌నగర్ శివారులో వరదనీటిలో మునిగిన వరిపొలాలు

కోదాడ : కోదాడ పట్టణంలో శనివారం రాత్రి కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. చరిత్రలో ఇంత పెద్ద వర్షానికి తాముఎప్పుడు చూడలేదని పలువురు వృద్ధులు చెపుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. శనివారం ఉదయం నుంచి రాత్రి 7-30 గంటల వరకు ఏకదాటిగా భారీ వర్షం కురిసింది. అధికారులు లెక్కల ప్రకారం పట్టణంలో 187 మి.మి వర్షపాతం నమోదైంది.

నీట మునిగిన నిర్మాణాలు

పెద్ద చెరువులోకి భారీగా నీరు చేరడంతో దాని ఎఫ్‌టీఎల్‌లో, బఫర్‌జోన్‌లో నిర్మాణం చేసిన వందల ఇళ్లు నీటమునిగిపోయాయి. అదేవిధంగా కోదాడ- అనంతగిరి రోడ్డు మీదుగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఇక్కడ ఉన్న ఒక కాలనీ నీటిలో మునిగిపోవడంతో వారిని పోలీసులు బయటకు తీసుకొచ్చారు. రంగా థియేటర్ సెంటర్‌లో సెల్లార్‌ల్లోకి నీరుచేరింది.

షిర్డీసాయినగర్ వాసులకు తీవ్ర ఇబ్బంది..

కోదాడ పెద్దచెరువు అలుగుతో షిర్డీసాయినగర్‌లోకి నీరు చేరింది. ఇక్కడ ఉన్న ముస్లిం మైనార్టీ పాఠశాల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

పొంగిన ఉలకవాగు..

శ్రీమన్నారాయణ కాలనీలో ఉన్న ఉలకవాగు పొంగడంతో కోదాడ- హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న వంతెన వద్ద రెండు వైపులా ఆక్రమించి భవనాలు నిర్మించడంతో వర్షపునీరు ఇళ్లల్లోకి చేరింది. ఈ ఉలకవాగు దాటుతూ ఉత్తమ్ పద్మావతి నగర్ వద్ద యరమాల వెంకటేశ్వర్లు (53), అజాద్‌నగర్ వద్ద నాగం రవికుమార్ (40)లు మృతిచెందారు.

మేళ్లచెరువు రోడ్డులో నరకం

భవానీనగర్ నుంచి మేళ్లచెరువు రోడ్డు వరకు ఉన్న నాలా ఆక్రమణకు గురికావడంతో భవానీనగర్‌లో పలు ఇళ్లు నీట మునిగిపోయాయి. ఇక్కడ ఒక ట్రాక్టర్, ఒక కారు నీటిలో కొట్టుకొనిపోయాయి. భవానీనగర్ నుంచి వచ్చిన ఎర్రకుంట వరదనీరు కింది వైపున ఉన్న శ్రీరంగాపురం గ్రామాన్ని చుట్టుముట్టింది. గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది.

మఠంపల్లి మండలంలో భారీ వర్షం..

మఠంపల్లి : మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షంతో పంట పొలాలు నీటమునిగాయి. మండలంలోని పలు చెరువు కట్టలు తెగడంతో వందలాది ఎకరాలలో వరినాట్లు కొట్టుకుపోగా ఇసుకమేటలు వేసి రైతులకు కడగండ్లుమిల్చాయి. రఘునాథపాలెంలో ఊరవాగు ఉప్పొంగడంతో గ్రామంలోని లోతట్టు ఇళ్లు ముంపునకు గురయ్యాయి. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెల్లవారేసరికి మండలంలోని మఠంపల్లి, చౌటపల్లి గ్రామాలను సందర్శించారు.

అతలాకుతలం చేసిన భారీ వర్షం

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలను అతలాకుతలం చేశాయి. మండలంలో దాదాపు అన్ని చెరువులు నిండాయి. నడిగూడెం చౌదరి చెరువు నిండి అలుగుపోయడంతో పలు వీధులు జలమయమయ్యాయి. ఎస్సీ, బీసీకాలనీలలో పలువురు ఇళ్లల్లోకి నీరు చేరాయి. చాకిరాల, రత్నవరం, వల్లాపురం గ్రామాల వద్ద ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

గరిడేపల్లి : మండలంలో శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఆదివారం ఉదయం మండలంలోని అప్పిరెడ్డిగూడెం వద్ద ఉన్న తాళ్లవాగు వంతెన పైనుంచి వరదనీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండటంతో సర్వారం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లమల్కాపురం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కీతవారిగూడెం, మునగాల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గరిడేపల్లిలో రావిచెరువు నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున వస్తుండటంతో సబ్‌స్టేషన్ చుట్టూ నీరుచేరింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పలువురు అధికారులు పరిస్థితిని సమీక్షించారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలోని నారాయణపురం ఊరచెరువు కట్ట నాలుగు చోట్ల తెగడంతో నీరు పొలాల మీదుగా తొగ్గరాయి చెరువుకు వెళ్లాయి. దీంతో వేల ఎకరాల్లో పంటపొలాలు నీట మునిగాయి. అదే విధంగా ఇళ్లలోకి నీరు చేరింది. అదే విధంగా నారాయణపురం నుంచి దూదియాతండా, సీత్లాతండా, కోదాడ గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. నీటి ఉధృతికి పొలాలు ఇసుక మేట వేశాయి. ఆర్లెగూడెం వద్ద ఆర్‌కే మేజర్ కాల్వకు గండి పడి నీళ్లు పొలాల్లోకి వెళ్లడంతో వందల ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి. బేతవోలు చెద్ద చెరువు అలుగు పోయడంతో బేతవోలు నుంచి చిలుకూరు, కోదాడకు రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపురం, ఆర్లెగూడెం, పోలేనిగూడెం, బేతవోలులో డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి నీళ్లు రావడంతో లబ్ధిదారులు ఇళ్లు ఖాళీ చేసి గ్రామంలోకి వచ్చారు. నారాయణపురం గ్రామాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పరిశీలించారు.

వర్షానికి ఇసుక మేట వేసిన పొలాలు

చిలుకూరు : మండలంలో శనివారం కురిసిన వర్షానికి అపార నష్టం వాటిల్లింది. నారాయణపురం గ్రామంలోని ఊరచెరువు కట్ట తెగడంతో వందల ఎకరాల్లో ఇసుక మేట వేశాయి. బేతవోలు గ్రామంలోని రామాలయంలోకి నీరు చేరింది.

తెగిన చెరువులు, కుంటలు

హుజూర్‌నగర్‌రూరల్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయి అలుగులు పోస్తున్నాయి. శనివారం భారీగా వర్షం కురవడంతో ఆయా గ్రామాల నుంచి వచ్చే వరద తాకిడికి బూరుగడ్డలో నల్లచెరువు, గోపాలపురంలో మోదుగులగుంట, తోగమడుగు చెరువు, వేపలసింగారంలో ఊర చెరువులు అర్ధరాత్రి తెగడంతో పంట పొలాలు కోట్టుకుపోయాయి. దీంతో మండల వ్యాప్తంగా సుమారు 250 ఎకరాలకు పైగా వరి పంటలు దెబ్బతిన్నాయి.

మోతె : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. రావిపహాడ్ పెద్దచెరువు అలుగుకు ఏర్పాటు చేసిన చేప జాలీలో చెరువు కాంట్రాక్టర్ తమ్ముడు మాదాసు నరేష్ చిక్కుకుని సుమారుగా 6గంటలు నీటిలోనే ఉన్నాడు. గ్రామస్తులు శ్రమించి అతికష్టం మీద అతడిని బయటకు తీశారు.

పలు గ్రామాలకు రాకపోకలు బంద్

మోతె : మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతుండడంతో పలు గ్రామాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రావిపహాడ్ ఎస్సీకాలనీలో మంద పరశురాములు ఇంటిపై చెట్టు కూలడంతో ధ్వంసమైంది.

హుజూర్‌నగర్‌లో 299 మిల్లీమీటర్ల వర్షపాతం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి పట్టణం అతలాకుతలమైంది. పట్టణంలో ఉదయం వరకు 299మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వర్షబీభత్సానికి పట్టణంలో దద్దనాల చెరువుకాలనీ, గోవిందపురం, పలు వార్డులలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకుబ్‌పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ రాత్రి నుంచే తమ సిబ్బందితో వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

భారీ వర్షాలకు అపారనష్టం

అనంతగిరి : మండల వ్యాప్తంగా కురిసిన అతి భారీ వర్షాలకు అపారనష్టం వాటిల్లింది. మండలంలోని పాలేరువాగు పారివాహక ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాయిలసింగారం చెరువును ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్ ఆదివారం పరిశీలించారు. పాలేరు రిజర్వాయర్ మెయిన్ కెనాల్‌కు గండిపడటంతో పాలేరు పారివాహక గ్రామాలు, లోతట్టు గ్రామాలైన చనుపల్లి 25ఇళ్లు, కిష్టాపురం 120ఇళ్లు మునిగిపోయాయి. తహసీల్దార్ హిమబిందు చనుపల్లి, కిష్టాపురం గ్రామాలలో వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండల వ్యాప్తంగా సుమారు 2వేల ఎకరాల పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారి అంజె సతీష్ తెలిపారు.

పొంగిన వాగులు

పాలకవీడు : మండల వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్ వెళ్లే దారిలో లోలెవల్ వంతెనలు మునిగిపోయాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పాటు పంట పొలాలు మునిగిపోయాయి. రాఘవపురం వద్ద వేములూరు వాగుకు భారీ వరద రావడంతో వాగుపై గల గాయత్రి పవర్‌హౌజ్‌లో పలువురు సిబ్బంది చిక్కుకోవడంతో పోలీసు యంత్రాంగం అతికష్టం మీద వారిని ఒడ్డుకు చేర్చారు.

భారీ వర్షానికి అతలాకుతలం

కోదాడరూరల్ : భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాలు శనివారం అతలాకుతలమయ్యాయి. అంతరగంగావాగులో నీటి ఉధృతి ఎక్కువ అయింది. దీనికి తోడు నారాయణపురం చెరువుకు గండి పడటంతో పాటు పలు చెరువులు అలగులుపడటంతో ఆ నీటి ఉధృతి మరింత ఎక్కువైంది. అంతరగంగా వాగు ఉప్పొంగి తొగర్రాయి గ్రామంలో ఎస్సీ కాలనీ 80శాతం ఇళ్లల్లోకి నీరు చేరాయి. కూచిపూడి గ్రామంలోని ఎస్సీకాలనీ ఇళ్లల్లోకి నీరు చేరింది. ఆ రెండు గ్రామాలలోకి వరదనీరు చేరడంతో భారీగా ఆస్తినష్టం జరిగింది.

పలు గ్రామాలకు రాకపోకలు బంద్..

అంతరగంగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంలో అధికారులు పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు.

రాష్ట్ర సరిహద్దులో ఉప్పొంగిన పాలేరు వాగు

కోదాడరూరల్ : రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్ వద్ద పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపైకి వరద నీరు చేరుకుంది. దీంతో అధికారులు హైదరాబాద్-విజయవాడ రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం, అటు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం శివారు రంగుల బ్రిడ్జివద్ద కూడా గండిపడింది. దీంతో రాకపోకలను పూర్తిగా నిలిపివేసి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి మిర్యాలగూడెం మీదగా వెళ్లేలా దారి మళ్లించారు.

భారీ వర్షాలకు నిండిన చెరువులు

మునగాల : మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలుచెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. మండలంలో 34చెరువులు ఉండగా ఆదివారం 29చెరువులు అలుగులు పోస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. తాడువాయి శివారులో గల గురప్పవాగు అలుగుపోస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా గణపవరం -మునగాల మధ్య నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండడంతో ఏర్పాటు చేసిన ఫార్మేషన్ రోడ్డు కొట్టుకుపోవడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఆకుపాముల ఊరచెరువు అలుగు పోస్తుండడంతో ఎస్సీకాలనీలోని పలు ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరింది. మండల వ్యాప్తంగా సుమారు 2వేల ఎకరాలలో వరి మునిగినట్లు సమాచారం.



కోదాడ : నయానగర్ వీధిలో పారుతున్న వర్షపునీరు



నడిగూడెం : కాల్వకట్ట తెగిన ప్రదేశానికి బైక్‌పై వెళ్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



నడిగూడెం ఎస్సీకాలనీలోకి చేరిన వరదనీరు



మునగాల-గణపవరం మధ్య కొట్టుకుపోయిన ఫార్మేషన్ రోడ్డు



నేరేడుచర్ల : చిల్లేపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది



హుజూర్‌నగర్ రూరల్ : బూరుగడ్డలో వరదకు కొట్టుకుపోయిన వరిపొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ తదితరులు



కోదాడ : అనంతగిరి రోడ్డులో తాడు సాయంతో రోడ్డు దాటుతున్న పాదచారులు



చిలుకూరు : బేతవోలు రామాలయంలోకి చేరిన వరదనీరు



పాలకవీడు : రావిపహాడ్ శివారు కృష్ణానది వరదలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



హుజూర్‌నగర్ : మట్టపల్లి బైపాస్‌రోడ్డు వద్ద కోతకు గురైన బీటీరోడ్డు



హుజూర్‌నగర్‌లో రోడ్డును తవ్వి నీరు వెళ్లే విధంగా నాలాను తెరిచిన మున్సిపల్ అధికారులు



మోతె : నర్సింహాపురంలో దేవిచెరువుకు గండి



గరిడేపల్లిలో సబ్‌స్టేషన్ చుట్టూ చేరిన నీరు



కోదాడ : కోదాడ సాయికృష్ణ థియేటర్ రోడ్డులో చేరిన వర్షపునీరు

నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలను సోమవారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించనున్నట్లు మంత్రి పీఆర్‌ఓ వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



అనంతగిరి : గోండ్రియాలలో పర్యటిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అనంతగిరి : వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోండ్రియాల, లకారం గ్రామాలలో ఆయన పర్యటించి మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన ఇళ్లను పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా ముంపుకు గురైన వారి కోసం ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ సీహెచ్ సూర్యానారాయణ, తహసీల్దార్ కె.హిమబిందు, ఎంపీడీఓ షేక్ సుప్పు, ఎస్‌ఐ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ జానకిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన ..

కోదాడ : వరద ప్రభావిత ప్రాంతాలలో ముంపునకు గురైన అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామస్తుల కోసం కోదాడలోని సీసీరెడ్డి విద్యాలయంలో అధికారులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సందర్శించారు.

పట్టణవాసుల కోసం మూడు కేంద్రాలు

కోదాడ మున్సిపాలిటీ పరిధిలో ముంపు బాధితుల కోసం బాలుర పాఠశాల, గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్, టీటీడీ కల్యాణ మండపంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కమిషనర్ రమాదేవి తెలిపారు.

తెగిన కాల్వకట్టను పరిశీలించిన కలెక్టర్

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం వద్ద ఆదివారం సాగర్ ఎడమకాల్వ కట్ట తెగడంతో కలెక్టర్ తేజస్ నందలాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రమాదంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద కారణంగా నష్టపోయిన తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కాగితరామచంద్రాపురం రైతులు కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట తహసీల్దారు సరిత, అధికారులు, రైతులు ఉన్నారు.

వరద తాకిడి ప్రాంతాల సందర్శన

హుజూర్‌నగర్ : పట్టణంలో కురిసిన భారీ వర్షం, వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం సందర్శించారు. ఉదయమే పట్టణానికి వచ్చిన ఆయన రెడ్డిబజార్, మట్టపల్లి రోడ్డులో దెబ్బతిన్న రోడ్లను, పంట పొలాలను సందర్శించారు. అధికారులకు తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, తహసీల్దార్ నాగేందర్, కమిషనర్ యాకుబ్‌పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది ఉన్నారు.

రాకపోకలు నిలిపివేత

కోదాడ : తెలంగాణ- ఆంధ్ర సరిహద్దుగా ఉన్న పాలేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వర్షానికి దెబ్బతిన్న రైల్వే ట్రాక్



మఠంపల్లి సమీపంలో దెబ్బతిన్న సాగర్ సిమెంట్స్‌కు వెళ్లే మార్గం రైల్వేట్రాక్

మఠంపల్లి : మండల కేంద్రం సమీపంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమలోకి గూడ్స్ రైళ్లు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రైల్వేట్రాక్ శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దెబ్బతింది. ఆదివారం రైల్వే అధికారులు, పరిశ్రమ అధికారులు ఈట్రాక్‌ను పరిశీలించారు. కాగా మఠంపల్లి నుంచి వెళ్లే రైల్వేలైన్‌కు ఎలాంటి సమస్యలు ఏర్పడలేదు.

మరబోట్లు, ప్రొక్లెయిన్‌ల ద్వారా బాధితుల తరలింపు

కోదాడ: భారీ వర్షానికి నీట మునిగిన కాలనీలోని ప్రజలను రక్షించడానికి ప్రభుత్వ యంత్రాంగం తొలిసారి కోదాడలో మరబోట్లను ఉపయోగించింది. ఖమ్మం రోడ్డులో 18వ వార్డు పరిధిలో ఉన్న షిర్డీసాయినగర్‌లోకి పెద్దచెరువు వరదనీరు తమ్మర వాగు ద్వారా వచ్చి పడింది. దీంతో అక్కడ నివాసం ఉంటున్న వారు బయటకు రాలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న అధికారులు ఉదయమే రెస్క్యూటీంలను రంగంలోకి దించారు. మరబోట్ల ద్వారా ఇళ్లలో ఉన్న వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఇదే సమయంలో ఆ వార్డు కౌన్సిలర్ ప్రొక్లెయిన్ సాయంతో మరి కొంత మందిని ఒడ్డుకు చేర్చాడు. అక్కడే ఉన్న ముస్లిం మైనార్టీ పాఠశాలలోని విద్యార్థులంతా రెండు, మూడవ అంతస్తుల్లో ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఉదయమే అక్కడి చేరుకుని వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి ఇళ్లకు పంపించారు.